సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 16 । మే । 2024



ఈదురుగాలుల బీభత్సం

పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లె గ్రామపంచాయితీలో ఈదురుగాలులకు సుమారు 80 ఎకరాల్లో అరటిపంట నేలకొరిగింది. - 10లో



చంద్రబాబు శకం ముగిసింది

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు శకం ఇక ముగిసినట్లేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

జిల్లాలో బుధవారం 27.6 - 38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాకు సబ్సిడీ విత్తనాలు మంజూరు

– జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు

కడప అగ్రికల్చర్ : జిల్లాకు ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించి 2024కు పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనగ, మినుములు, పెసర, కందులు, రాగి పంటలకు సంబంధించిన వివిధ విత్తనాలు 12252 క్వింటాళ్లు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు తెలిపారు. ఇందులో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు 4780 క్వింటాళ్లు, జనుములు 463 క్వింటాళ్లు, పిల్లపెసలు 80 క్వింటాళ్లు, వేరుశనగ 5849 క్వింటాళ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇందులో పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం, వేరుశనిక్కాయలను 40 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు తెలిపారు. విత్తనాలను రైతులకు సబ్సిడీ ద్వారా ఆర్‌బీకేలో DKQIHI app యాప్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు ఆర్‌బీకే సిబ్బంది విత్తన పంపిణీపై విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. విత్తరాల కోసం వచ్చే రైతులు వివరాలను డి క్రిషి యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

కడప కల్చరల్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని ప్రధాన కార్యాలయంతోపాటు జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో గురువారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా కార్యదర్శి అమీరుద్దీన్ తెలిపారు. తమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను జూన్ 7వ తేది వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతిరోజు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచే కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు ప్రత్యేక శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పిల్లల్లో చదివే అలవాటును పెంచేందుకు 'చదవడం మాకిష్టం' కార్యక్రమం కింద పుస్తక పఠనం చేయించడం శిక్షణలో ముఖ్యమైన అంశమన్నారు. ప్రతిరోజు కథలు చెప్పడం, శారీరక వ్యాయామాలు, ఆటపాటలు, క్రీడలు, చదివిన పుస్తకాల సారాంశం చెప్పడం, ఆంగ్లంలో మాట్లాడటం, చిత్రకళం, సంగీతం, నృత్యం, నాటకం, తోలుబొమ్మల తయారీ తదితర అంశాలలో శిక్షణ ఉంటుందన్నారు. జూన్ 7న కార్యక్రమాల ముగింపు సందర్భంగా అతిథులతో వారికి శిక్షణలో పాల్గొన్న సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నట్లు, వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలను అందజేయనున్నట్లు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సులలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని సహాయ ఆచార్యులు డాక్టర్ పి.శర్వానంద్ తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని విద్యా సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్స్ మేనేజ్‌మెంట్ నెల్లూరులో ఉందన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రముఖ సంస్థల్లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, ప్లేస్‌మెంట్స్ కల్పించడమే ఈ విద్యా సంస్థ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్), బీబీఏ (టూరిజం అండ్ ట్రావెల్) కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంబీఏ కోర్సుకు ఏదైనా డిగ్రీ కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9966462786, 9490787854 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో మెరిసిన ఏపీ బాలిక



పోలు వైష్ణవి

బ్రహ్మంగారిమఠం : తెలంగాణా రాష్ట్రంలో టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డిపల్లె పంచాయతీ గంగిరెడ్డిపల్లెకు చెందిన పోలు బ్రహ్మానందరెడ్డి కుమార్తె వైష్ణవి 500లకు 496మార్కులు సాధించింది . తెలంగాణా రాష్ట్రంలో మొదటి ర్యాంక్ రావడంతో గ్రామంతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.

20న ఊటీకి ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ : వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 20న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 20న రాత్రి 9 గంటలకు బయలుదేరి 21న ఊటీకి చేరుకుంటుందన్నారు. ఆ రోజు ఊటీలో ఉండి 22న ఉదయం బయలుదేరి మైసూర్‌కు వస్తుందని, అక్కడ ప్రదేశాలు, సాయంత్రం బృందావన్ గార్డెన్స్‌లో లైటింగ్ షో చూసుకుని రాత్రి బయలుదేరి 23న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రాను,పోను చార్జీ రూ.2,800 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 7382875034, 7382876658, 9441646104 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళలే నిర్ణేతలు!

సాక్షి ప్రతినిధి, కడప : సార్వత్రిక ఎన్నికల్లో మహిళలే నిర్ణేతలుగా నిలిచారు. పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా నమోదు అయ్యాయి. సరాసరిగా ప్రతి నియోజకవర్గంలో 5వేలు ఓట్లు పురుషుల కంటే అధికంగా మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంపైన పురుషుల కంటే మహిళా ఓట్లు 35,471 ఓట్లు అధికంగా పోల్ అయ్యాయి. ఈలెక్కలు తెరపైకి రావడంతో మహిళల ఓటింగ్ తమకే పడ్డాయనే ధీమా ఇరు పార్టీల్లో వ్యక్తమవుతోంది. సంక్షేమ పథకాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలనే తలంపుతో మహిళలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని ఆ పార్టీ పూర్తి నమ్మకంగా ఉంది. ఉచిత బస్సు ప్రయాణం హామీ, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఈరెండు హామీలకు కారణంగా మహిళలు అండగా నిలిచారని టీడీపీ భావిస్తోంది.

వాస్తవాలను పరిశీలిస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు అగ్రపీఠం వేసింది. ప్రతి పథకం మహిళా అభ్యున్నతే లక్ష్యంగా రూపొందించారు. ఆయా పథకాలు అందుకు అద్దం పడుతున్నాయి. జిల్లాలో 2,16,222 మంది మహిళలకు అమ్మఒడి పథకం ద్వారా రూ.912కోట్లు లబ్ధి చేకూరింది. రూ.3లక్షలు లోపు రుణం తీసుకునే డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా వడ్డి రాయితీ రూ.190 కోట్లు ప్రభుత్వం భరించింది. ఈ పథకం ద్వారా 3,68,801 మంది మహిళలకు లబ్ధి చేకూరింది. పింఛన్ కానుక ద్వారా దాదాపు 1.5లక్షల మందికి రూ.1470 కోట్లు పైబడి లభించింది. 45 ఏళ్ల పైబడి 60లోపు మహిళల ఆర్థికాభివృద్ధి కోసం వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,500 చొప్పున 1,04,325 మంది మహిళలకు రూ.546 కోట్లు చెల్లించారు. విడతల వారీగా డ్వాక్రా రుణాలు మాఫీ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 2,78,124 మంది మహిళలకు రూ.776కోట్లు లభించింది. హౌసింగ్ స్కీమ్‌లో 66,488 మంది మహిళలకు రూ.631 కోట్లు వర్తించింది. మొత్తంగా పరిశీలిస్తే 10,33,960 మంది మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందారు. ఇందులో రెండు, మూడు, నాలుగు పథకాలు కూడా వర్తించిన మహిళలు లేకపోలేదు. ఇవన్నీ పరిశీలిస్తే వైఎస్సార్‌సీపీకి మహిళల ఓట్లు అధికంగా పడ్డాయనే భావనను ఆ పార్టీ వ్యక్తం చేస్తోంది. ఎగువశ్రేణి మహిళలు వారి విచక్షణ ఆధారంగా ఓటు వేస్తే, దిగువ శ్రేణి మహిళ ఓటర్లు పార్టీలకతీతంగా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని విశ్లేషకులు భావిస్తున్నారు.



ఓటింగ్‌లో మహిళలదే పైచేయి

జిల్లాలో సగటు పోలింగ్ శాతం 79.57గా నమోదైంది. మొత్తం ఓటర్లు 16,39,066 మంది ఉండగా, అందులో పురుషులు 8,00,857, మహిళలు 8,37,993, ఇతరులు 216 మంది ఉన్నారు. పోలింగ్‌లో 13,04,256 (79.57 శాతం) ఓట్లు పోలయ్యాయి. అందులో పురుషులు 6,34,349, మహిళలు6,69,820, ఇతరులు 87మంది ఉన్నారు. **నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లను పరిశీలిస్తే....** బద్వేలు నియోజకవర్గంలో 1,72,660 (78.74 శాతం) ఓట్లు పోల్ కాగా, అందులో పురుషులు 84,491, మహిళలు 88,167, ఇతరులు 2ఓట్లు వేశారు. ఇక్కడ 3,676 ఓట్లు పురుషుల కంటే మహిళలవే ఎక్కువగా పోల్ అయ్యాయి. కడప నియోజకవర్గంలో 1,85,079 (65.27 శాతం) ఓట్లు పోల్ కాగా, అందులో పురుషులు 88,536, మహిళలు 96,511, ఇతరులు 32 మంది ఓటు వేశారు. ఇక్కడ కూడా 7,975 మహిళా ఓట్లు అధికంగా పోల్ అయ్యాయి. పులివెందుల నియోజకవర్గంలో 1,86,834 (81.34 శాతం) ఓట్లు పోల్ కాగా, అందులో పురుషులు 91,484, మహిళలు 95,340, ఇతరులు 10 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కమలాపురం నియోజకవర్గంలో 1,72,401 (84.44) ఓట్లు పోల్ కాగా, అందులో పురుషులు 83,917, మహిళలు 88,472, ఇతరులు 12 మంది ఓటు వేశారు. 4,555 ఓట్లు అధికంగా మహిళ ఓటింగ్ నమోదయ్యింది. జమ్మలమడుగులో 2,10,241 (86.68 శాతం) ఓట్లు పోలయ్యాయి. అందులో పురుషులు 1,02,789, మహిళలు 1,07,449, ఇతరులు 3 ఓటుహక్కు సద్వినియోగం చేసుకున్నారు. అక్కడ 4,660 మంది మహిళలు అధికంగా పాల్గొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 1,97,349 (79.59 శాతం) ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 95,260, మహిళలు 1,02,062, ఇతరులు 27 మంది ఓటు వేశారు. 6,802 మహిళలు అధికంగా ఓట్లు వేశారు. మైదుకూరు నియోజకవర్గంలో 1,79,692 (84.82 శాతం) ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 87,872, మహిళలు 91,819, ఇతరులు 1ఓటు వేశారు. పురుషుల కంటే 3,947 మంది మహిళలు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇలా ప్రతి నియోజకవర్గంలో మహిళ ఓటర్లు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. గెలుపోటముల నిర్ణేయితలుగా మహిళలే నిలుస్తున్నారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

ఆమె దీవెనలపైనే...

మహిళ ఓటర్లు దీవెనలు తమకే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం పార్టీలు ఎవరికివారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రాక్టికల్‌గా మాట్లాడుతున్నాం, మునుపెన్నడు కనివిని ఎరుగని రీతిలో మహిళలకు అండగా నిలిచింది, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికే మహిళలు కృషి చేశారని ఆ పార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. తమ పార్టీ హామీల ఆకర్షణతోనే మహిళలు అండగా నిలిచారని టీడీపీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నా, గత చరిత్ర చంద్రబాబు హామీలు విస్మరణ ఇవన్నీ ప్రతిబంధకాలుగా నిలవనున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, నేతల భవితవ్యం ఈవీఎంలల్లో నిక్షేపితమై ఉంది. వాస్తవాలు తెలియాలంటే ఫలితాలు వచ్చేవరకు ఆగాల్సిందే.

విద్యార్థి సామర్థ్యం ఆధారంగా బోధన

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల తరగతి సామర్థ్యం ఆధారంగానే విద్యాబోధనలు జరపాలని పర్సనలైజ్డ్ అడాప్టివ్ లర్నింగ్(పీఏఎల్) ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ మర్రెడ్డి అనూరాధ పేర్కొన్నారు. బుధవారం కడప జయనగర్ కాలనీ జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్రశిక్ష ఏపీఓ రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాలలోని పీఏఎల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో నోబుల్ అవార్డు గ్రహీత రాబర్ట్ మైకేల్ ఆధ్వర్యంలో రూపకల్పన కేసిన కాన్వి జీనియస్ కంటెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ప్రపంచంలోని 120 దేశాలు అమలు పరుస్తున్న పీఏఎల్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని 564 పాఠశాలల్లో 2019 నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. కాన్వి జీనియస్ కంటెంట్ డెవలప్‌మెంట్ డిప్యూటీ మేనేజర్లు సౌరభ్ గౌర్, ఉజ్వల్, అనిరుధ్, పీఏఎల్ కోఆర్డినేటర్ కిషోర్‌బాబు ఎఎల్ కార్యక్రమ అవశ్యకత గురించి, తరగతి గదిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చేయవలసిన విధి విధానాల గురించి క్లుప్తంగా వివరించారు. కడప, అన్నమయ్య, నంద్యాల, కర్నూలు జిల్లాల నోడల్ ఆఫీసర్లు అశోక్‌రెడ్డి, దస్తగిరి రెడ్డిలు, డీఈఓ, సమగ్రశిక్ష కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి

నిఘా నీడలో ఈవీఎంలు

- సీసీ కెమెరాలతో పహారా
- మూడంచెల భద్రత
- జూన్ 4 వరకు స్ట్రాంగ్ రూముల్లో భద్రం

రాయచోటి : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ రెండు రోజుల కిందట ముగిసింది. ఈవీఎంలను మంగళవారం రాత్రి కల్లా అన్నమయ్య జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. రాజంపేట పార్లమెంట్‌తో పాటు రాజంపేట, రాయచోటి, కోడూరు, మదనపల్లె, తంబల్లపల్లి, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 1609 పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేసిన ఈవీఎంలు రాయచోటిలోని స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. పార్లమెంట్, ఆరు నియోజకవర్గాలకు చెందిన పార్టీల అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. జూన్ 4వ తేదీ వరకు ఈవీఎంలు ఆయా స్ట్రాంగ్ రూముల్లోనే భద్రంగా ఉండనున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిషోర్, జిల్లా ఎస్పీ కృష్ణారావు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేపట్టారు. స్ట్రాంగ్ రూమ్‌కు ప్రత్యేక అధికారిని నియమించారు. స్ట్రాంగ్‌రూమ్ ప్రాంగణంలోకి ఉన్నతాధికారుల అనుమతులు ఉన్న అధికారులను మాత్రమే అనుమతించనున్నారు. సార్వత్రిక ఎన్నికలు నాలుగో దశలో భాగంగా 13వ తేదీన సోమవారం జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. జిల్లాలో అధికార వైఎస్సార్‌సీపీ, టీడీపీ-జనసేన-బీజేపీ కూటముల మధ్య ప్రధానంగా ఎన్నికల పోరు సాగింది. ఎన్నికల్లో ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఈవీఎంలను స్ట్రాంగ్ రూముకు తరలించారు. ఆ రూములకు రెండు రకాల తాళాలను వేశారు. కౌంటింగ్‌రోజు ఉదయం మాత్రమే ఆ గదులను తెరిచి ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తారు. ఒక తాళం చెవి జిల్లా ఎన్నికల అధికారి వద్ద, రెండోది నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. స్ట్రాంగ్ రూమ్ తలుపులు కిటికీలు పూర్తిగా మూసివేశారు. కిటికీలకు పటిష్టమైన చెక్కలు, ఇటుకలను అమర్చి ప్లాస్టింగ్ చేశారు. ఎవరూ లోపలికి వెళ్లకుండా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. గది బయట మొదటి అంచలో ఒక ప్లాటూన్ కేంద్ర బలగాలను రక్షణగా నియమించారు. ఒక ప్లాటూన్‌లో 30 నుంచి 50 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. విధులు నిర్వహించే సిబ్బందికి సంబంధించి లాగ్‌బుక్ ఏర్పాటు చేశారు. భద్రతా సిబ్బంది మూడు విడతలుగా పనిచేసేలా డ్యూటీలు కేటాయించారు.

సీసీ కెమెరాలతో నిఘా

స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అలాగే స్ట్రాంగ్ రూమ్ పక్కనే 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్ ప్రవేశ మార్గాన్ని నిరంతరం సీసీ టీవీ కెమెరాల నిఘాలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగితే వెంటనే మంటలను అదుపు చేసేందుకు స్ట్రాంగ్ రూమ్ లోపల, వెలపల తగినన్ని అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచారు. ప్రాంగణంలోకి ప్రవేశించాలంటే ఉన్నతాధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారి ప్రతి రోజు ఉదయం సాయంత్రం వేళ స్ట్రాంగ్ రూమ్ ప్రాంగణాన్ని సందర్శించి బుక్కును సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించాల్సి ఉంటుంది.

నేటి నుంచి ఈఏపీసెట్



ఈఏపీసెట్‌కు పరీక్ష కోసం కేఎస్ఆర్ఎంలో సిద్ధం చేసిన కంప్యూటర్ ల్యాబ్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 16 నుంచి 23వ తేదీ పరీక్షల నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో 20 వేలకు పైగా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను రాయనున్న విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభంకానున్న ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (ఏపీఈఏపీసెట్)- 2024 నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో ఈనెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ పరీక్షను ఉదయ, సాయంత్రం రెండు సెషన్స్‌లో నిర్వహించనున్నారు. సంబంధిత పరీక్షలను కంప్యూటర్ ఆధారిత (ఆన్‌లైన్) విధానంలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అగ్రికల్చర్, ఫార్మసీ (బైపీసీ) విద్యార్థులకు ఈనెల 16, 17 తేదీల్లో, ఇంజనీరింగ్ స్ట్రీమ్ (ఎంపీసీ) విద్యార్థులకు 18 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో 15 వేలకుపైగా ఇంజనీరింగ్‌కు, సుమారు 5వేల మంది అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షను ఆన్‌లైన్‌లో రాయనున్నారు.

రెండు సెషన్స్‌లో పరీక్ష

ఈఏపీసెట్‌కు సంబంధించి ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించనున్నారు. ఇందులో ఉదయం సెషన్‌కు సంబంధించి 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం సెషన్‌కు సంబంధించిన విద్యార్థులను 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాలోకి అనుమతిస్తారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించిన విద్యార్థులను మధ్యాహ్నం 1 గంట నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరీక్ష రోజే కులధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది.

జిల్లావ్యాప్తంగా ఈఏపీసెట్‌ను రాయనున్న విద్యార్థుల సంఖ్య వివరాలు

పరీక్షా కేంద్రం పేరు	ఇంజనీరింగ్ విభాగం విభాగం	అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ
కేఎస్ఆర్ఎం	1219	412
శ్రీనివాస	2363	801
అన్నమాచార్య	1729	438
కేఓఆర్ఎం	1729	597
కేఎల్ఎం	1880	400
ఎస్ఆర్ఐటి (పొద్దుటూరు)	2064	692
సిబిఐటి	2243	598
అన్నమాచార్య (రాజంపేట)	2299	596
బాస్కర్ ఇంజనీరింగ్ కాలేజ్ (రాయచోటి)	937	419

రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు!

- మైదుకూరు నియోజకవర్గం చాపాడులో యథేచ్ఛగా దౌర్జన్యకర ఘటనలు
- ఖాదరపల్లె హత్యాయత్నం కేసు నిందితులపై పోలీసుల ఉదాసీనత
- పక్షం రోజులవుతున్నా నామమాత్రపు చర్యలే
- పుట్టా సుధాకర్ హైలెవెల్ పైరవీలే కారణం
- తాజాగా విశ్వనాథపురం ఎన్నికల ఏజెంట్‌పై దాడి

సాక్షి ప్రతినిధి, కడప : వైఎస్సార్ జిల్లా మైదుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. క్రమం తప్పకుండా దౌర్జన్యకర ఘటనలు తెరపైకి రావడమే అందుకు నిదర్శనం. హత్యాయత్నానికి పాల్పడిన నిందితుల పట్ల పక్షం రోజులుగా పోలీసులు ఉదాసీనతతో వ్యవహరించారు. దీంతో పల్లవోలులో చోటుచేసుకున్న మరో ఘటనకు కారకులయ్యారు. టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ హైలెవెల్ పైరవీలు, బ్లాక్‌మెయిల్ వ్యవహారాలే అందుకు కారణంగా తెలుస్తోంది. తాజాగా విశ్వనాథపురం పోలింగ్ ఏజెంట్‌గా కూర్చున్న చంద్ర ఓబులరెడ్డిపై బుధవారం సాయంత్రం దాడి ఘటన చోటుచేసుకుంది.

ఎన్నికల్లో పోలీసుల ముందస్తు చర్యలు అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో సత్ఫలితాలు ఇచ్చాయి. అయితే చాపాడు లాంటి ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలపై ఉదాసీనత వల్ల మరింత రెచ్చిపోయేందుక ఆస్కారం ఏర్పడింది. అసాంఘిక శక్తులను కట్టడి చేయడంలో విఫలం కావడంతో మరింత రెచ్చిపోయేందుకు అవకాశం ఏర్పడింది. ఆయా ఘటనలు పరిశీలిస్తే ఏప్రిల్ 6న కర్నూలు సరిహద్దులో 250 మద్యం కేసులు తరలిస్తూ లాల్‌బాషా, జాకీర్‌లు పట్టుబడ్డారు. తర్వాత అదే మద్యం సీరీస్‌తో తయారైన మద్యం పుట్టా సుధాకర్ అనుచరుల వద్ద కూడా బి.మఠం మండలంలో పట్టుబడింది. వెంటనే పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే, తర్వాత ఘటనలకైనా ఫుల్‌స్టాఫ్ పడేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు వెళ్లేందుకు చర్చించారనే కారణంగా జాఫర్ అనే వ్యక్తిపై మే1న లాల్‌బాషా, జాకీర్ బృందం హత్యాయత్నానికి పాల్పడింది. ఆస్పత్రిలో చికిత్సలు తీసుకుంటున్న జాఫర్‌ను కిడ్నాప్‌నకు ప్రయత్నించారు. మే11న చాపాడులో జమాల్ అనే వ్యక్తికి చెందిన బైక్‌ను తగలబెట్టారు. 12వ తేదీ రాత్రి పల్లవోలు గ్రామంలో రమణయ్యకు చెందిన బొలెరో వాహనానికి నిప్పు పెట్టారు. పోలింగ్ ఏజెంట్‌గా కూర్చుంటావా అంటూ వాట్సాప్‌లో హెచ్చరికలు చేస్తూ, బెదిరింపులకు దిగారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్ భర్త జైనుల్లాను పొలం వద్ద కత్తులు చూపి బెదిరించారు. ఇవన్నీ లాల్‌బాషా, జాకీర్, ఫకృద్దీన్, హబిబుల్లా, నాసీర్ అండ్ టీమ్ ద్వారా చోటుచేసుకున్న ఘటనలుగా పలువురు వివరిస్తున్నారు. మద్యం కేసు నమోదు కాగానే పోలీసులు వేంగా చర్యలు తీసుకుని ఉంటే జాఫర్‌పై హత్యాయత్నం చోటుచేసుకునే అవకాశం లేదు. పోనీ హత్యాయత్నం కేసులో స్పీడ్‌గా స్పందించి ఉంటే, మరిన్ని ఘటనలు వీరి ద్వారా ఉత్పన్నం అయ్యే అవకాశం ఉండేది కాదని పరిశీలకులు భావిస్తున్నారు. పైగా పోలింగ్ రోజున కూడా లాల్‌బాషా టీమ్ హల్‌చల్ చేసిందని సమచారం.

పుట్టా సుధాకర్ పైరవీలే కారణమా?

ఎస్పీ సిద్ధార్థకౌశల్ ముందస్తు చర్యలు చేపట్టినా చాపాడులో లాల్‌బాషా టీమ్‌ను కట్టడి కాలేదు. టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పోలీసు యంత్రాంగంపై బ్లాక్‌మెయిల్ వ్యవహారాలతో కూడిన ఒత్తిడి, పైరవీలు చేయడంతోనే లాల్‌బాషా టీమ్‌ను టచ్ కూడా చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. పక్షం రోజులుగా నిందితులు యథేచ్ఛగా అక్రమ వ్యవహారాల్లో తలదూరుస్తున్నారు. ఈక్రమంలోనే విశ్వనాథపురంలో వైఎస్సార్‌సీపీ తరఫున పోలింగ్ ఏజెంటుగా కూర్చున్న చంద్రఓబుళరెడ్డిపై ఆరుగురు వ్యక్తులు మైదుకూరులో దాడి చేశారు. లాల్‌బాషాకు తగ్గట్లుగానే టీడీపీ శ్రేణులు రెచ్చిపోతుండడమే అందుకు కారణంగా తెలుస్తోందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే తప్ప, ఇలాంటి ఘటనలు కట్టడి అయ్యే అవకాశం ఉండదు. ఇప్పటికైనా పోలీసులు అసాంఘిక శక్తులపట్ల కఠిన చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌తో లాల్‌బాషా (ఫైల్)

క్లుప్తంగా

చీకటి వలయంలో మల్లికార్జునపురం

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని మల్లికార్జునపురంలో మూడు రోజుల నుంచి కురిసిన వర్షాలకు, ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు కిందపడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బుధవారం డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులను అడుగుతున్నా స్పందించకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి వాన, ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి విద్యుత్ లైన్లు తెగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మల్లికార్జునపురంలో విద్యుత్ లైన్లు సరిచేసి వెంటనే విద్యుత్ సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఎస్ఐ మృతికి ఎమ్మెల్యే నివాళి



ఏఎస్ఐ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ రాజుపాలెం అన్వర్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఏఎస్ఐ భౌతికకాయానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహ, ఎస్ఐ రవికుమార్, పోలీసు అసోసియేషన్ కడప జిల్లా అధ్యక్షులు దూలం సురేష్, కార్యదర్శి ఉప్పు శంకర్‌లు ఏఎస్ఐ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల ఖర్చులకు గాను పోలీసుశాఖ తరపున రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

యువతి మిస్సింగ్.. కేసు నమోదు

మదనపల్లె : బంధువుల ఇంటికి వచ్చి యువతి అదృశ్యం కావడంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని సుభాష్ రోడ్డు మైకావీధిలో నివాసం ఉంటున్న ముని కుమార్ ఇంటికి, అతని మేనకోడలు నాగయశ్విని (19)వచ్చింది. 14వ తేదీ మంగళవారం సాయంత్రం ఇంట్లోని చెత్త బయట పడవేస్తానంటూ వెళ్లి అదృశ్యమైంది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో మేనమామ మునికుమార్ బుధవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఏఎస్ఐ ఎర్రబ్రెల్లి వెంకటరమణ కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కందిమల్లాయపల్లె కళకళ

- వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- అధిక సంఖ్యలో తరలివస్తున్న భక్తులు



అశ్వవాహనంపై స్వామి, అమ్మవారి ఊరేగింపు



మహా నైవేద్యం కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీవెంకటాద్రిస్వామి

బ్రహ్మంగారిమఠం : శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలతో కందిమల్లాయపల్లె (బ్రహ్మంగారిమఠం) కళకళలాడుతోంది. రెండు రోజుల నుంచి ఈ ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున శ్రీ వీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉభయదారులు గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మల్లయ్య, ధనలక్ష్మి, డాక్టర్ యక్కల సురేష్ బాబు, స్వప్న కోరిక మేరకు ఉత్సవం నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం మహా నైవేద్య పూజ కార్యక్రమాన్ని పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రి స్వామి, కుటుంబ సభ్యులు నిర్వహించారు.

వైభవంగా గజవాహనోత్సవం

రాత్రి గజవాహనోత్సవం వైభవంగా సాగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గజవాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి శ్రీవీరశివ కుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్ద మఠం చేరుకుంది. ఉత్సవానికి గుంటూరు జిల్లా బుద్దాంకు చెందిన కట్టోజు సత్యనారాయణచార్యులు, వరహాలమ్మ, విశ్వనాథాచారి, గురుస్వాములు, శివరూపాచారి ఉభయదారులుగా వ్యవహరించారు. స్వామి మాల ధారులు ఇరుముడి సమర్పణ కోసం పెద్ద ఎత్తున వస్తున్నారు. వారి ఎరుపు రంగు, కషాయ వస్త్రాధారణతో మాఢ వీధులు కళకళలాడుతున్నాయి. పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరంబ దత్తాత్రేయస్వామి పాల్గొన్నారు.

భక్తుల సందడి

దర్శనీయ స్థలాల్లో భక్తుల సందడి నెలకొంది. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, స్వామి నివసించిన గృహం, శ్రీ ఈశ్వరీదేవిమఠం, పోలేరమ్మగుడి, కక్కయ్య మఠం, అచలానందస్వామి ఆశ్రమం, రామాలయం, వీరబ్రహ్మేంద్రాశ్రమం, పోలేరమ్మచే నిప్పు తెప్పించిన రచ్చబండ, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, ముడుమాలలోని సిద్దయ్యమఠం, అక్కంపేటలోని విభూతి నాగలింగేశ్వరస్వామి దేవస్థానం, బ్రహ్మంసాగర్‌ను భక్తులు సందర్శించారు.

ఓటు వేసి వచ్చే సరికి ఇల్లు గుల్ల

- రూ. 3 లక్షల విలువైన బంగారం, రూ. 10 వేల నగదు చోరీ

మదనపల్లె : ఓటు వేసేందుకు కుటుంబంతో పాటు సొంత ఊరికి వెళ్లి తిరిగి వచ్చే సరికి దొంగలు ఇల్లు గుల్ల చేశారు. ఈ ఘటన మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. నీరుగట్టువారిపల్లె పుల్లారెడ్డి వీధికి చెందిన ఆటో డ్రైవర్ బషీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 11వ తేదీన ఓటు వేసేందుకు, స్వగ్రామమైన కదిరి నియోజకవర్గం ఎన్.పి.కుంట మండలం ధనియాల చెరువుకు వెళ్లాడు. మరుసటి రోజు 12వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బషీర్ ఇంట్లోకి చొరబడి, బీరువా పగలగొట్టి అందులోని నగదు నగలు చోరీ చేసి ఎత్తుకెళ్లారు. 13వ తేదీ ఉదయమే గమనించిన స్థానికులు బషీర్ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా చోరీ విషయం తెలిపారు. ఓటు వేసి తిరిగి వచ్చిన బషీర్ ఇంట్లో చోరీ జరిగిన విషయం నిర్ధారించుకుని బుధవారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూ.3 లక్షల విలువైన ఆరుతులాల బంగారం నగలు, రూ.10,000 రూపాయల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు బాధితుడు పేర్కొన్నాడు. టూ టౌన్ సీఐ యువరాజు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చైర్మన్ జగదీశ్వర రెడ్డి

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలను అందరు కలిసి విజయవంతం చేయాలని దేవస్థానముల చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి పేర్కొన్నారు. సంజీవరాయస్వామి ఆలయంలో బుధవారం తిరుణాలకు సంబంధించి పోస్టర్లు, పుస్తకాలను చైర్మన్‌తో పాటు మెంబర్లు ఆవిష్కరించారు. ముందుగా ఆలయంలో స్వాములకు వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చైర్మన్ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని, అందులో ప్రధానంగా 20న కల్యాణోత్సవం, 22న హనుమంతోత్సవం, 23న గరుడోత్సవం, 25న రథోత్సవం (తిరుణాల) జరుగుతాయని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ సిబ్బందికి భక్తులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మెంబరు బీరం వెంకటరామిరెడ్డి, రాజుపాళెం సింగిల్‌విండో బ్యాంకు చైర్మన్ చెమికెల బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లదిమ్ము భాస్కర్ రెడ్డి, జీరెడ్డి రామమోహన్ రెడ్డి, అర్చక ఎక్స్ అఫిషియో మెంబర్ మధవాచార్యులు పాల్గొన్నారు.

22న తిరుమన్నామలైకి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అరుణాచలగిరి ప్రదక్షిణ కొరకు ఈ నెల 22వ తేదీన తిరుమన్నామలైకి రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పాలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి రాత్రి 8 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా తిరుమన్నామలైకి బస్సు బయలుదేరుతుందన్నారు. సూపర్‌లగ్జరీ బస్సులో రూ. 1,072గా ఛార్జి నిర్ణయిచారన్నారు.
- బద్వేలు డిపో నుంచి ఉదయం 7.00 గంటలకు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా, మరొక బస్సు అదే సమయంలో పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళుతుందన్నారు. అల్ట్రా డీలక్స్ సర్వీసులో రూ.1,566, సూపర్ లగ్జరీలో రూ.1,475 ఛార్జి నిర్ణయించామన్నారు.
- మైదుకూరు డిపో నుంచి పోరుమామిళ్లలో ఉదయం 6.00 గంటలకు, మరొక బస్సు సాయంత్రం 6.00 గంటలకు మైదుకూరు నుంచి కడప, రాయచోటి మీదుగా వెళుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సులో రూ. 1414, 1,188గా ఛార్జి ఉంటుందన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి మధ్యాహ్నం 3.00 గంటలకు ఇంద్ర ఏసీ బస్సు కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో రూ.1,569గా ఛార్జి ఉంటుందన్నారు.
- జమ్మలమడుగు నుంచి రాత్రి 8.00 గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా బస్సు బయలుదేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ. 1,352 ఉందన్నారు.
- పులివెందుల డిపో నుంచి రాత్రి 8.00 గంటలకు బస్సు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు సర్వీసు వెళుతుందన్నారు. ఇందులో రూ.1,242 టిక్కెట్ ధరగా నిర్ణయించారన్నారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ నాయకులపై కేసు

మదనపల్లె : ఓటుహక్కు వినియోగించుకునేందుకు వెళితే, టీడీపీ నాయకులు అడ్డుకుని దాడికి పాల్పడ్డారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో భాగంగా వలసపల్లె పంచాయతీ పోలింగ్‌బూత్ నెం.86లో బేరిపల్లెకు చెందిన సీ.సిద్ధారెడ్డి సాయంత్రం ఓటుహక్కు వినియోగించుకునేందుకు వెళ్లాడు. టీడీపీ నాయకులు ఎస్.చెంగారెడ్డి, శ్రీనివాసులురెడ్డిపై సిద్ధారెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

జమ్మలమడుగులో కొనసాగుతున్న ఉద్రిక్తత

- పార్టీల కార్యాలయాల వద్ద బందోబస్తు

జమ్మలమడుగు : పట్టణంలో ఇంకా ఎన్నికల ఉద్రిక్తత కొనసాగుతూనే ఉంది. ఇరు పార్టీలకు నాయకులు ఎవరి గ్రామాల్లో వారు ఉండాలని పోలీసులు ఆదేశించారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండ పోలీసులు పహారకాయడంతో పాటు అదనంగా 500 మంది ప్రత్యేక బలగాలు రప్పించారు. ఈ నెల 13న సోమవారం రాత్రి ఇరుపార్టీలకు చెందిన నాయకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో పట్టణంలో నివురుగప్పిన నిప్పులా మారిపోయింది. గత కొన్ని సంవత్సరాలుగా జమ్మలమగుడులో ఎలాంటి గొడవలు లేకుండ ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో కాలం గడిపారు. ఎన్నికల రోజు జరిగిన ఘర్షణతో భయాందోళన చెందుతున్నారు. ఎటువంటి గొడవలు జరుగకుండ పటిష్ట చర్యలను తీసుకుంటామని డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. ఇరుపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఉప్పెనలా పాజిటివ్ ఓటు

- చంద్రబాబు ఇంటికే
- పోలింగ్‌బూత్ వద్ద సిద్ధం సభల జనసునామి
- మహిళలు టీడీపీ కంట్లోకారం కొట్టారు
- రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



ఆకేపాటిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట : ఒక ప్రభుత్వానికి మద్దతుగా ఇంత పాజిటివ్ ఓటు ఉప్పెనలా పోటెత్తడం దేశ చరిత్రలో ఇదే ప్రప్రథమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ అనంతరం బుధవారం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో ఆకేపాటిని కలిసి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మహిళలు వైఎస్సార్‌సీపీ జేజేలు కొట్టారన్నారు. సీఎం వైఎస్ జగన్ అందచేసిన సంక్షేమ పథకాలకి ఓటు రూపంలో అక్కాచెల్లమ్మలు, అవ్వాతాతలు రుణం తీర్చుకొన్నారన్నారు. మండే ఎండను కూడా లెక్క చేయకుండా ఫ్యాను గుర్తుకు ఓటేసేందుకు తండోపతండాలుగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారని తెలిపారు. వార్ వన్‌సైడ్ అన్నట్లుగా వైఎస్సార్‌సీపీ విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తంచేశారు. చంద్రబాబు రాజకీయాలు వదిలేసి ఇంటికి పరిమితం కావాల్సిందేనని ఎద్దేవాచేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ బారులు తీరిన మహిళలతా పసుపుపార్టీకి కంట్లో కారం కొట్టారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోపాటు తనకు, ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డికి ఆశీస్సులు ఇవ్వడానికి సునామిలా తరలివచ్చిన అవ్వాతాతలకు , అక్కచెల్లమ్మలకు కృతజ్ఞతలను తెలియచేస్తున్నాన్నారు.

ఈదురుగాలుల బీభత్సం.. అపార నష్టం

- సుమారు 80 ఎకరాల్లో నేలకొరిన అరటి పంట
- ఆదుకోవాలని వేడుకుంటున్న అన్నదాతలు



ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి పంట

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లె గ్రామపంచాయితీ కొత్తపల్లె, మల్లికార్జునపురం, న ల్లపురెడ్డిపల్లె గ్రామాలలో రెండు రోజుల నుంచి వీస్తున్న ఈదురుగాలులకు సుమారు 80 ఎకరాల్లో అరటిపంట నేలకొరిగింది. ఈదురుగాలులు, గాలివానలు తీవ్రంగా రావడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అరటిపంట చేతికి అందే సమయంలో ఈదురుగాలుల వలన అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు సంబంధించి సుమారు 80 ఎకరాల్లో అరటి పూర్తిగా దెబ్బతింది. సుమారు అరటి పంట విలువ రూ.70లక్షల నుంచి రూ.80లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న అరటి పంటలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అజ్జుగుట్ట భాస్కర్‌రెడ్డి, యూత్ నాయకుడు కొమ్మ ఉమేష్‌రెడ్డి పరిశీలించి ఈదురుగాలుల వలన దెబ్బతిన్న అరటి పంటల వివరాలను పులివెందుల మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చవ్వా దుశ్యంత్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి రాఘవేంద్రారెడ్డికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు నష్టపోయిన అరటి పంట రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు.

నేలకొరిగిన అరటి పంట



నేలకొరిగిన అరటి పంటను చూపిస్తున్న రైతులు

సింహాద్రిపురం : మండలంలోని బిదినంచెర్ల గ్రామంలో గాలి బీభత్సవానికి అరటి తోట నేలకొరిగి రైతులకు నష్టాలను మిగిల్చింది. బిదినంచెర్లకు చెందిన సంతోష్‌రెడ్డి, మల్లికార్జున అరటి పంటను సాగు చేశారు. రెండు రోజుల నుంచి వీస్తున్న గాలి బీభత్సవానికి అరటి చెట్లు నేలకొరిగాయి. చేతికొచ్చిన పంట నేలపాలవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. సుమారుగా రూ.8 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. పంటను బుధవారం హెచ్‌ఈఓ వీరారెడ్డి పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. తమకు నష్ట పరిహారం అందించాలని రైతులు వేడుకున్నారు.

రైతులను ఆదుకోవాలి



ఈదురుగాలుల బీభత్సవానికి దెబ్బతిన్న అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. చేతికి అందివచ్చే సమయంలో ఈదురుగాలుల వలన సుమారు వేల అరటి చెట్లు నేలమట్టమయ్యాయి. నేలకొరిగిన అరటి పంటలను కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులు ఎవరూ ముందుకు రారు. అందువల్ల అరటి తోటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-ప్రసాద్, అరటి రైతు

ఈదురుగాలులకు పూర్తిగా దెబ్బతిన్న అరటి తోటలు



గత రెండు రోజుల నుంచి పులివెందుల మండల పరిధిలోని గ్రామాల్లో ఈదురుగాలులకు సుమారు వేల ఎకరాల్లో అరటి పంటలు దెబ్బతిన్నాయి. పంటలు బాగా పండి మార్కెట్‌లో అధిక ధర పలుకుతోంది. ఈ సమయంలో పంట దెబ్బతినడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఈదురుగాలుల బీభత్సం వలన అరటి తోటలు పూర్తిగా నేలకొరిగాయి. రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

-రామాంజనేయులు, అరటి రైతు

కసాయి తండ్రి అరెస్ట్




నిందితుడు సురేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు

వేంపల్లె : మూడో పెళ్లికి అడ్డు వస్తాడని భావించిన ఓ కసాయి తండ్రి కన్న కొడుకును కడతేర్చి కటకటాల పాలయ్యాడు. వేంపల్లె అప్ గ్రేడ్ ఇన్‌స్పెక్టర్ షేక్ చాంద్‌బాషా తెలిపిన వివరాల ప్రకారం ... ప్రొద్దుటూరుకు చెందిన సురేష్ అనే వ్యక్తి జమ్మలమడుగు పట్టణానికి చెందిన చౌడమ్మను వివాహం చేసుకున్నాడు. మనస్పర్ధల కారణంగా దంపతులు విడిపోయారు. అనంతరం అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె మండలం రెడ్డిమొల్లపల్లి గ్రామానికి చెందిన సంధ్య అనే మూగ, చెవిటి మహిళను కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి శ్రీనివాసరావు అనే బాలుడు జన్మించాడు. నిందితుడు తన కులానికి చెందిన మహిళను మూడో వివాహం చేసుకోవాలనే ఉద్దేశంతో తల్లీకొడుకును అడ్డు తొలగించుకోవాలని పన్నాగం పన్నాడు. మూడు నెలల క్రితం బాలుడి పురుషాంగంపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో కడప, తిరుపతిలో చికిత్స చేయించాడు. ఈ నెల 11న సురేష్ మద్యం మత్తులో కుమారుడి శ్రీనివాసరావును గొంతు నిలిపి నేలకేసి కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడి మృతి చెందాడు. విచారించిన పోలీసులు నిందితుడిని 15వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్ట్

మదనపల్లె : హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌కు చెందిన సాంబశివ (39) చేనేత కార్మికుడు. ఈనెల 1వ తేదీన తనతో పాటు పనిచేసే బుడాన్‌గిరిని దూషించాడు. రామారావుకాలనీలో నివాసం ఉన్న బావమరిది సయ్యద్ ఆసిఫ్ (28)కు ఈ విషయం తెలియడంతో సాంబశివపై కక్ష పెంచుకుని, మే 3న హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేశారు. బుధవారం సయ్యద్ ఆసిఫ్ పట్టణంలోని చౌడేశ్వరి సర్కిల్ వద్ద ఎస్ఐ వెంకటసుబ్బయ్య అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామన్నారు.

అక్రమంగా మట్టితరలిస్తున్న లారీలు సీజ్



లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లె జిల్లేలమడక చెరువులో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆర్ఐ రామ్మోహన్ నాయుడు తెలిపారు. జిల్లేలమడక చెరువులో ఇరిగేషన్ అధికారులుతో అనుమతులు తీసుకున్నామని చెప్పి టిప్పర్లు ద్వారా ఇటుకల బట్టీలకు మట్టిని తరలిస్తుండడంతో బుధవారం వీఆర్‌ఓ అడ్డుకున్నారు. అనంతరం రెండు వాహనాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

ముగిసిన చంద్రబాబు శకం

- బాబు, లోకేష్, బాలకృష్ణ ఓటమి ఖాయం
- 135 సీట్లతో వైఎస్సార్‌సీపీకి అధికారం
- జిల్లాలో 10 స్థానాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీవే
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : 2024 ఎన్నికలతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు శకం ఇక ముగిసినట్లేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కుప్పం నుంచి పోటీ చేసిన చంద్రబాబు, మంగళగిరి నుంచి పోటీ చేసిన నారా లోకేష్, హిందూపురం నుంచి పోటీ చేసిన నందమూరి బాలకృష్ణ ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. కుప్పంలో చంద్రబాబుపై పోటీ చేసిన యువకుడు భరత్ విజయం సాధిస్తారని, తమ పార్టీ అధిష్టానం వద్ద పక్కా సమాచారం ఉందని వెల్లడించారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 120 నుంచి 135 సీట్లతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తప్పక అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 10 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు, మైదుకూరులో పోటీ తీవ్రంగా ఉందని, ప్రొద్దుటూరులో పరిస్థితి సంక్లిష్టంగా ఉందని వస్తున్న పుకార్లను ఆయన కొట్టిపారేశారు.

చంద్రబాబుది దింపుడు కల్లెం ఆశ

2014 ఎన్నికల్లో వ్యవసాయ, డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తానని మోసం చేసిన చంద్రబాబుకు 2019లాగే ఈ సారి కూడా ప్రజలు ఓటు వేయలేదన్నారు. చంద్రబాబు మాత్రం వాస్తవ విషయాలు వెల్లడించకుండా తానే అధికారంలోకి వస్తున్నట్లు మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నాననే భ్రమలో ఉన్నారని ఎద్దేవాచేశారు. స్పష్టమైన మెజారిటీతో ప్రజలు జగన్‌కు అధికారం కట్టబెట్టనున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 శాతం పోలింగ్ జరిగిందని తెలిపారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూతతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి డబ్బు రావాల్సి ఉండగా వారికి ఇవ్వొద్దని చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. అన్ని విచారించిన తర్వాత ఈనెల 10వ తేదీన ఒక్క రోజులోనే లబ్ధిదారులకు డబ్బు చెల్లించాలని ఎన్నికల కమిషన్ చెప్పగా బాబు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారని తప్పుబట్టారు. ఈ కారణంగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బు చేరలేదని తెలిపారు. ఎన్నికలు ముగిసిన తర్వాత బుధవారం లబ్ధిదారుల ఖాతాలకు డబ్బు జమ చేస్తుండగా కాంట్రాక్టర్లలకు మాత్రం బిల్లులు చెల్లించొద్దని ముడిపెట్టారన్నారు. అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ల బిల్లులను చెల్లించాల్సి ఉందని, ఇప్పటికే బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.